క్లుప్తంగా

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



పూజలు చేస్తున్న సభ్యులు

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామంలో కుర్మల ఆరాధ్యదైవం శ్రీ బీరప్ప దేవుడి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖైండ్ల కళాకారుల డప్పు, చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఆలయానికి వచ్చారు. అనంతరం పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షులు మచ్చేందర్, ఉపాధ్యక్షుడు వినాయక్, మండల యూత్ అధ్యక్షుడు మహేందర్, పలువురు సభ్యులు శ్రీనివాస్, మల్లేశ్, రమేశ్, సాయన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల పండుగ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే)లో ఆదివారం గ్రామ దేవతల పండుగ ఘనంగా నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో ముందుగా గోదావరి జలాలతో గ్రామదేవతలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పాడి పంటలు, ప్రజలు బాగుండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు శ్రీనివాస్, పోశెట్టి, సాయన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సాయం



సన్మానిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

నర్సాపూర్(జి): నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మద్దెర్ల అక్షయ అనే విద్యార్థినిని మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం ఆ సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా గ్లోబల్ హెల్త్ ఈక్విటీ ఆసియా పసిఫిక్ అండ్ జపాన్ రీజనల్ మేనేజర్ డాక్టర్ చాట్ల చక్రపాణి మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీ చాట్ల దామోదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25వేలను విరాళాన్ని అందించారు. పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు చాట్ల దామోదర్, అధ్యక్షులు బక్కన్న, పరికిపండ్ల గంగారాం, మిట్టపల్లి రాజేందర్, గోవర్ధన్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ ఒలంపియాడ్ పాఠశాలలో జిల్లా నిరుద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్య, ఉద్యోగం ప్రాముఖ్యత, పొగాకుతో నష్టాలు, కాలుష్య నివారణ కు తీసుకోవాల్సిన చర్యలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా పలు పాఠశాలల విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లాండిగె సాయికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంప్రకాశ్, సిందే మీనా, ముత్యంపేట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.


నీటి సమస్యల పరిష్కారానికి కృషి



పనులు పరిశీలిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలో నెలకొన్ని నీటి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో స్థానిక డబుల్‌బెడ్‌రూం కాలనీకి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ ఆదివారం దగ్గరుండి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీ టి సరఫరాను పునరుద్ధరించారు. మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న శ్రేణులు

భైంసాటౌన్: ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో ఆదివారం సాయంత్రం పట్టణంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద, ఎస్ఎస్ కాటన్‌లో టపాసులు కాల్చారు. మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, నాయకులు గంగాధర్, పోశెట్టి, గౌతం పింగ్లే, గాలి రాజన్న తదితరులున్నారు.

గుంత.. తీర్చేను నీటి చింత

- గ్రామాల్లో జోరుగా సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



లోకేశ్వరంలో గుంత తవ్వుతున్న సిబ్బంది



లోకేశ్వరం మండలం జాం గ్రామపంచాయతీ ఎదుట నిర్మించిన సామూహిక ఇంకుడుగుంత

లోకేశ్వరం: వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భజలాలను పెంచేందుకు ప్రభుత్వం ఇంకుడుగుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గ్రామాల్లో మురుగు కాల్వల చివరన సామూహిక ఇంకుడగుంతలను నిర్మిస్తుంది. గతంలో ఇంటింటికీ ఇంకుడుగుంత నిర్మించేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. ఈసారి ప్రతి గ్రామపంచాయతీలో ఐదు సామాజిక ఇంకుడుగుంతలు నిర్మించాలని నిర్ణయించారు. లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, సామూహిక మరుగుదొడ్ల వద్ద సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణం చేపడుతున్నారు.

ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు..

నీటి నిల్వ ఉండేందుకు ఉపాధిహామీ పథకం కింద ఇంకుడుగుంతలను నిర్మిస్తున్నారు. జాబ్‌కార్డుదారులు ఇళ్ల వద్ద ఇంకుడుగుంత తవ్వుకుంటే రూ.ఆరు వేలు, గ్రామపంచాయతీల్లో నిర్మించే ఒక్కో సామూహిక ఇంకుడుగుంతకు రూ.12వేలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. పల్లెల్లో నీటి నిల్వ పెంచేందుకు మురుగుకాల్వల చివరన ఇంకుడుగుంతలు తవ్వాలని నిర్ణయించారు.

గతంలోనివి ఉపయోగంలోకి తీసుకురావాలి..

గతంలో నిర్మించిన ఇంకుడుగుంతల్లో వర్షపునీరు వెళ్లేలా చర్యలు తీసుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. వాటిలోకి వృథా నీటిని మళ్లిస్తే భూగర్భజలాలు పెరిగి పరిసరాల్లో శుభ్రత నెలకొంటుంది. ఇప్పటికే పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయి. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేకరిస్తూ వీధులను శుభ్రంగా ఉంచుతున్నారు. మురుగుకాల్వల్లో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఇంకుడుగుంతల నిర్మాణాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇంకుడుగుంతలు నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు విడుదల చేస్తే మరికొందరు ముందుకొచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఇంకుడుగుంతలతో కలిగే ప్రయోజనాలను అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లా వివరాలు..

ఇప్పటివరకు జిల్లాలోని ఆయా గ్రామాల్లో 3,200 సామూహిక ఇంకుడుగుంతలు నిర్మించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇంటింటికీ నిర్మించే ఇంకుడుగుంతలు 15,600 పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు.

ఇంకుడుగుంతతో సరిపడా నీరు



గతంలో మా ఇంటి వద్ద నిర్మించుకున్న ఇంకుడుగుంతతో భూగర్భజలాలు పెరి గాయి. ఇళ్లలో వినియోగించిన నీరు ఈ గుంతలోకి వెళ్లేలా మళ్లించాం. గతంలో కంటే మా బోరు నుంచి నీరు బాగానే వస్తుంది. ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంత నిర్మించుకోవాలి.

– భూమయ్య, సాథ్‌గాం

గ్రామాల్లో పనులు ప్రారంభించాం



ప్రభుత్వ ఆదేశాలతో ము రుగు కాల్వల చివర సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలకు పనులు ప్రారంభించాం. అన్ని మండలాల్లోని గ్రామాల్లో సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నిర్మించుకున్న వెంటనే బిల్లులు అందిస్తాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

గ్రామాల్లో భీమన్న దేవుడి పండుగ

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఆదివారం భీమన్న దేవుడి పండుగను ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంప్రదాయబద్ధంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కొత్తవెంకూర్ గ్రామంలో ఆదివారం నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న దేవుడి పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా భజనలు చేస్తూ భీమన్న ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం భీమన్న ఘటాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పంటలు పండాలని వేడుకున్నారు. సంఘ సభ్యులు శ్రీనివాస్, గంగాధర్, దినేశ్, శ్యామ్, అనిల్‌కుమార్, పన్న గణేశ్, సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో పూజలు చేస్తున్న నాయక్‌పోడ్‌లు



కొత్తవెంకూర్‌లో ఆలయానికి వెళ్తున్న సభ్యులు

వైభవంగా గజ్జలమ్మ జాతర



మహాలక్ష్మీదేవికి ఉల్లిగడ్డలు నైవేద్యంగా సమర్పిస్తున్న మహిళలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ జాతర (తీర్థం)ను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు డప్పు, వాయిద్యాల నడుమ లోకేశ్వరం మండలం గడ్‌చాంద గ్రామంలోని గోదావరి జలాలను ఆలయానికి తీసుకొచ్చి శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ప్రతిమలకు అభిషేకం చేశారు. అనంతరం గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరణ, పల్లకిసేవ చేశారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, భోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, కిన్వట్ ప్రాంతాల భక్తులు మండల కేంద్రంలోని ఆలయానికి వచ్చి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవార్లకు ఉల్లిగడ్డలు, ఓమ, పేలాలు, పుట్నాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు భక్తులను అలరించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆదివాసీ విద్యార్థినికి చేయూత

ఖానాపూర్/దస్తురాబాద్: పెంబి మండలం పసుపుల గ్రామానికి చెందిన టేకం సుశీల దస్తురాబాద్‌లోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి చదివి 9.2 జీపీఏ సాధించింది. ఆమె హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఇంటర్ కళాశాలలో సీటు సాధించింది. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి కావడంతో ఆదివారం ఖానాపూర్ పీఆర్టీయూ భవన్‌లో స్థానిక టీకేఆర్ ఫౌండేషన్ సభ్యులు కృష్ణంరాజు రూ.ఐదు వేల విలువైన దుస్తులు, బ్యాగుతోపాటు కొంత ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాథోడ్ శ్రీనివాస్, భీమన్న, శ్రీనివాస్, రమేశ్, శివ, చరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బోరు ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు వేయించారు. స్థానికులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకెళ్లగా బోరు ఏర్పాటు కు నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఆకుల వెంకాగౌడ్, జంగిలి శంకర్, గాజుల గంగన్న, మామిడాల శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, నీరటి ప్రవీణ్, సొన్న మహేశ్, వంశీ తదితరులు ఉన్నారు.

ఆనందోత్సాహాల నడుమ సమ్మేళనం

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదోతరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆదివారం పాఠశాలలో సమావేశమై సందడిగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఇక్కడ చదువుకున్న మస్కాపూర్, బాదన్‌కుర్తి గ్రామాల విద్యార్థులు పాఠశాలలో సందడిగా గడిపారు. అనంతరం తమకు చదువుచెప్పి ప్రయోజకుల్ని చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కడెం హరిత రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడిగా గడిపారు. అంతకుముందు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, షీల్డ్‌లతో సత్కరించారు.



లోకేశ్వరం: కన్కపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమైన 2006-07 బ్యాచ్ విద్యార్థులు



మస్కాపూర్‌లో 2003-04 బ్యాచ్ విద్యార్థులు..



కడెంలో సమావేశమైన 2001-02 విద్యార్థులు

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కలశ పూజలో భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థాన ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు నవీన్‌చారి, రామకృష్ణ ఉదయం స్వామివారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలశపూజ, పూజాది కార్యక్రమాలు జరిపించారు. అనంతరం స్వామివారి పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమెడ శ్రీధర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి

బాసర: మండల కేంద్రంలో ఇటీవల గెంటెల మల్లయ్య, రాజు చవాన్, బాల లక్ష్మి తల్లి గంగవ్వ అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబసభ్యులను ఆదివారం వారి నివాసాల్లో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం సరస్వతి ఆలయంలో లడ్డు తయారీలో విధులు నిర్వర్తించే ఎస్ఎంఆర్ సావిత్రి చె య్యి విరగడంతో యోగక్షేమాలను తెలుసుకున్నా రు. తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు పెద్దకొండ్రు సుధాకర్‌రెడ్డి, లక్ష్మణరావు, బాల మల్లన్న యాదవ్, జిడ్డు మల్లయ్యయాదవ్, డిష్ పోతన్న, ఖలీల్, సుధాకర్‌రావు, ప్యాట్ల రమేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



గజ్జలమ్మ తండాలో ఉపాధ్యాయుల ప్రచారం



లక్ష్మణచాంద : వద్యాల్‌లో..

కుంటాల: ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని రాజాపూర్ తండా, గజ్జలమ్మతండా, అందాకూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న మౌలిక వసతులను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సక్రవు గజేందర్, సగ్గం గంగాధర్, సాహెబ్ రావు, ధర్మాజీ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పీచరలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. సర్కారు బడుల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు సాయినాథ్‌రెడ్డి, సబిత, లావణ్య, శారద, వింధ్యారాణి, హంసలత, మోహన్‌రెడ్డి, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి.. ప్రయాణానికి ముప్పు



లక్ష్మణచాంద కేజీబీవీ సమీపంలో ప్రమాదకరంగా రోడ్డుపై మట్టి

- జారి కింద పడుతున్న ద్విచక్ర వాహనదారులు
- మట్టి తొలగించాలని వేడుకోలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రోడ్డుపై 200 మీటర్ల మేర ఉన్న మట్టితో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. లక్ష్మణచాంద, పొట్టపెల్లి(కె) గ్రామాల రైతులు మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ఇటీవల వరిధాన్యం ఆరబెట్టుకున్నారు. వర్షం కురిస్తే వరద వెళ్లకుండా రైతులు టార్పాలిన్లు కప్పి పంట కుప్పల చుట్టూ మట్టి పోశారు. కానీ పంటను అమ్ముకున్న తర్వాత రైతులు మట్టిని తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో వర్షాలు కురిసినప్పు డు ఈమార్గంలో వాహనదారులు జారి కింద పడుతున్నారు. గతంలోనూ పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టి తొలగించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతలమయంగా రోడ్డు



తానూరు: భైంసా నుంచి మండలంలోని ఝరి(బి) గ్రామానికి వెళ్లే మార్గంలో బీటీ రోడ్డు వర్షరి సమీపంలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరగక ముందే అధికారులు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

గంట అందజేత

దస్తురాబాద్: మండల కేంద్రానికే చెంది న నిమ్మతోట రాకేశ్ అనే భక్తుడు ఆదివారం మండలంలోని భూత్కూర్‌లో పోచమ్మ ఆలయానికి ఎలక్ట్రిక్ గంటను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శివయ్య, రాజా గౌడ్, నాగరాజు, గోపి, రవి పాల్గొన్నారు.